# చిట్టికథ

# నరసింహం

నరసింహారావు బాగానే చదువుకున్నాడు. కష్టపడి చిన్న ఉద్యోగం కూడా సంపాదించాడు. ఉద్యోగం వచ్చింది గదా అని పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళి జరిగిందికదా అని పిల్లలు పుట్టుకొచ్చారు. ఉద్యోగం టెంపరరీ కావడం వల్ల నాలుగేళ్ళకే ఊడి పోయింది. భార్యా పిల్లలు పర్మనెంటు కావడం వల్ల అతుక్కుపోయారు. కుటుంబపోషణ కష్టమై పోయింది. నరసింహారావుకి, ఏమీ దిక్కు తోచడం లేదు. ఇలా వుండగా ఆ వూళ్ళోకి ఒక పెద్ద సర్కసు కంపెనీ వచ్చి గుడారం వేసింది. సర్కస్ కంపెనీలో వందలకొద్దీ ఉద్యోగులుంటారని నరసింహారావుకి బాగా తెలుసు. వెళ్లి ఆ మేనేజరు గార్ని కలుసుకుని నమస్కారం పెట్టాడు "బాగా చదువుకున్నారు. విచక్షణాజ్ఞానం వున్న యువకులు. మీకు యిక్కడ ఏం పని వుంటుందండీ" అన్నాడు సర్కస్ మేనేజరు. "బాబ్బాబు, అలా అనకండి, చదువుకున్నమాట నిజమే. కావాలంటే ఆ డిగ్రీ కాగితాలతో చీపురుకట్టి మీ దేరా అంతా ఊడుస్తాను, ఎంత చిన్నదైనాసరే నాకొక ఉద్యోగం యిప్పించండి". అని ప్రాధేయపడ్డాడు నరసింహారావు. మేనేజరు కాసేపు ఆలోచించి, "మా సర్కస్‌లో మంచి ఫీట్స్ చేసే ఒక సింహం ఈ వూరు వస్తూ వుండగా, దారిలో చచ్చిపోయింది. అది లేకపోతే కష్టమే మాకు, మీరాపని చేయగలరా?" అన్నాడు. "బాబోయ్" అని నోరు వెళ్ళబెట్టాడు నరసింహం. "వేషం మాత్రమే, ఇటునుంచి మెట్లెక్కి నాలు గడుగులు ఒక సన్నటి చెక్కవంతెన మీద నడిచి అటునుంచి దిగి మళ్లీ బోనులోకి పోవడమే" అన్నాడు మేనేజరు. తప్పదనుకున్నాడు నరసింహారావు. కుటుంబపోషణ ముఖ్యం అతనికి. తొలిరోజు గడిచింది. ప్రేక్షకులు కూడా బాగానే చప్పట్లు కొడుతున్నారు. పదిహేను రూపాయలు చేతి కొచ్చాయి. పని కూడా చాలా తేలిక. చిన్నప్పుడు బళ్లో జారుడుబల్ల మెట్లెక్కి దిగినట్టే వుంది. బాగానే వుందనుకున్నాడు. మూడో రోజు ప్రదర్శనలో ఇంటి బాధల్ని గురించి ఆలోచించు కుంటూ వంతెన మీద నడుస్తూ పరధ్యానంగా అలా క్రిందికి చూశాడు. గత రెండు రోజుల్లో ఎప్పుడూ అలా చూళ్లేదు. చూసి గతుక్కుమన్నాడు. అన్నీ సింహాలే బాబోయ్, కాలుజారి క్రిందపడితే ఏమన్నా వుందా? పెద్దగా అరవలేడు. జనానికి తను అసలు సింహం కాదని తెలిస్తే పట్టుకు చావగొడతారు. క్రింద చూస్తే అడవి సింహాలు. "వెంకటేశ్వర పాహిమాం", అన్నాడు చిన్నగా. తను మనిషన్న సంగతి ఈ సింహాలకి తెలిస్తే బతకనిస్తాయా, ఓరి దేవుడా, తాను కూడా నిజం సింహం అని మిగతా సింహాలకి కూడా నమ్మకం కల్గిస్తేనే కానీ ప్రాణం దక్కదనుకున్నాడు. యింటి దగ్గర ప్రాక్టీస్ చేసిన సింహం అరుపు క్రింద సింహాలకి మాత్రమే వినిపించేంత బిగ్గరగా అరిచాడు. క్రింద నుంచి సింహాలు, మెడలు పైకెత్తి చూశాయి. "ఎందు కలా అరుస్తావ్, యిక్కడ నువ్వొక్కడివే సింహాని వనుకొంటున్నావా? యేమిటి? మేమూ సింహాలమే, యస్, వియారాల్సో లాయన్స్!" అన్నది క్రింద నుంచి ఒక ముసలి సింహం. నరసింహారావుకి కళ్ళు తిరిగినంత పనయింది!

—అబ్బూరి రాజ్యలక్ష్మీదేవి



## 1978 లో....

క్యూబా రాజధాని హవానా నగరంలో పదకొండవ అంతర్జాతీయ యువజనోత్సవాలు జరిగాయి. ఆ ఉత్సవాలలో వివిధ రంగాలలో ఆరితేరిన యువతీ యువకులు ఎందరో పాల్గొన్నారు. ఒక దేశం సంస్కృతీ సంప్రదాయాలు మరొకరు తెలుసుకోవడం, ఒకరి కళలు మరొకరు నేర్చుకోవడం, అన్నిటికీ మించి వివిధ దేశాల మధ్య సామరస్యాన్ని పెంపొందింపజేయడం ఈ యువజనోత్సవాల ముఖ్యోద్దేశం.

ఆ విధంగా మన నాట్యం గురించి విదేశీయులకు తెలియజేయడానికి క్యూబాలో జరిగిన అంతర్జాతీయ యువజనోత్సవాలకు భారతదేశం తరపున ప్రతినిధిగా ఎన్నికైన వనిత-కుమారి జి. సరళ.

సరళ కూచిపూడి నృత్యంలో బాగా కృషి చేసి పేరు తెచ్చుకున్నది. కూచిపూడి నాట్య శాస్త్రంలో ఉద్దండులైన జె. సీతారామశాస్త్రి, వెంపటి చిన సత్యం, భారత కళా ప్రపూర్ణ కోరాడ నరసింహారావు, సుమతీ కౌశల్ వంటి ప్రముఖుల వద్ద ఆమె శిక్షణ పొందింది!

కుమారి సరళ తన ఎనిమిదవ ఏటినుంచే నాట్య ప్రదర్శనలు ఇస్తూ పలువురి ప్రశంసలు అందుకోవడం ఒక విశేషం. మద్రాసు, హైద్రాబాదు దూర దర్శన్ ద్వారా ఆమె నాట్యాలు ప్రదర్శింపబడ్డాయి. రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి ఎదుట నాట్య ప్రదర్శన ఇచ్చి ఆయన మెప్పు పొందింది. ఆ నాడు ఆమె చేసిన 'అర్ధనారీశ్వర' నృత్యానికి సభికులు ముగ్ధులయ్యారు.

సరళ హైద్రాబాదు సరోజినీ నాయుడు స్త్రీల కళాశాలలో బి. ఏ. చివరి సంవత్సరం చదువుతున్నది. ఒకవైపు విద్యార్థినిగా వుంటూనే మరోవైపు 'నృత్య నికేతన్' పేరిట నాట్య పాఠశాలను